సాక్షి
మంచిర్యాల

శుక్రవారం ◊ 2 ◊ మే ◊ 2025



సంక్షేమాధికారులకు పోస్టింగ్

ఎస్సీ వసతిగృహ సంక్షేమాధికారులుగా ఎంపికైన వారికి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రవీందర్‌రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. 8లో▸



ఘనంగా మే డే

జిల్లా వ్యాప్తంగా మే డే వేడుకలను కార్మిక వర్గాలు ఘనంగా నిర్వహించాయి. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఎర్రజెండాలు ఎగురవేశారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.0 /27.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఎండల తీవ్రత పెరుగుతుంది. ఉత్తరం దిశగా వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సన్న బియ్యం విక్రయిస్తే రేషన్‌కార్డు రద్దు

మంచిర్యాలటౌన్: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్‌కార్డుదారులకు పంపిణీ చేస్తున్న సన్నబియ్యం విక్రయిస్తే రేషన్‌కార్డు రద్దు చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని తాండూరు మండలం అచ్చలాపూర్ గ్రామానికి చెందిన 11 మంది సన్నబియ్యం విక్రయించడంతో రేషన్‌కార్డులు రద్దు చేశామని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన కుంకు మొట్టి మహేశ్‌కు బియ్యం విక్రయించారనే సమాచారంతో అతడి నివాసంలో తనిఖీలు చేయగా, సన్నబియ్యం నిల్వలు లభించాయని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రేషన్‌కార్డుదారులు రద్దు చేశామని పేర్కొన్నారు. నిరుపేదల నుంచి బియ్యం కొనుగోలు చేసిన వారిపైనా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కుల గణన చరిత్రాత్మక నిర్ణయం



మోదీ చిత్రపటానికి రఘునాథ్ పాలాభిషేకం

దండేపల్లి: దేశవ్యాప్తంగా కులగణనకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మకం అని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. హర్షం వ్యక్తం చేస్తూ దండేపల్లి బీజేపీ కార్యాలయంలో గురువారం మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కులగణన చేపట్టడం ఇదే మొదటిసారి అన్నారు. గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు కులగణపై ఆలోచన చేసినా ముందుకు సాగలేదని తెలిపారు. దేశంలో ఉన్న అన్ని కులాలకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో మోదీ ప్రభుత్వం కులగణనకు అంగీకరించడం హర్షణీయమని అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాజయ్య, నాయకులు గురువయ్య, సురేందర్, నరేష్, సంతోష్, లక్ష్మణ్, శేఖర్, అశోక్, కిషన్, రవీందర్, రాకేష్, వెంకటేశ్వ ర్లు, మల్లేష్, గురువయ్య, మహేష్ పాల్గొన్నా రు.

సివిల్ సర్వీసెస్‌కు ఉచిత శిక్షణ

మంచిర్యాలటౌన్: యూపీఎస్సీ, సీఎస్ఏటీ 2026 సివిల్ సర్వీసెస్ పరీక్షకు మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 100 మంది మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా అభ్యర్థులకు 33.33 శాతం సీట్లు, అన్ని రిజర్వుడు కేటగిరీల్లో దివ్యాంగులకు 5 శాతం సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. స్టడీ సర్కిల్‌లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని, ఎంపిక ప్రక్రియ పూర్తిగా మెరిట్ ప్రకారం ఉంటుందని తెలిపారు. సివిల్ సర్వీసెస్ అప్టిట్యూడ్ టెస్టులో ప్రవేశం కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని ప్రొఫెషనల్/సాధారణ డిగ్రీ చేసిన మైనారిటీ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో https://cet.cgg.gov.in,ww w.tmreistelanga na.cgg.gov.in ద్వారా ఈ నెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలని, జూన్ 5న జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో స్క్రీనింగ్ టెస్టు నిర్వహిస్తామని తెలిపారు.

మున్సిపల్ ఎదుట బీఆర్ఎస్ ఆందోళన



కార్యాలయం ఎదుట బైఠాయించిన బీఆర్ఎస్ నాయకులు

చెన్నూర్: చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తునారని ఆరోపిస్తూ గురువారం బీ ఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజారమేశ్ ఆధ్వర్యంలో కార్యాలయం ఎదు ట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ము న్సిపల్ కమిషనర్, ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామిలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజారమేశ్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ ఫ్లెక్సీలను తీయకుండా బీఆర్ఎస్ ఫ్లెక్సీలను తొలగించడం దారుణమని అన్నారు. అధికారిగా ఉంటూ ఏకపక్షంగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదన్నారు. సీఐ దేవేందర్‌రావు సంఘటన స్థలానికి చేరుకొని ఏ పార్టీతో సంబంధం లేకుండా అన్ని ఫ్లెక్సీలు తొలగిస్తామని నచ్చజెప్పడంతో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన విరమించారు. బీఆర్ఎస్ నాయకులు రాంలాల్‌గిల్డా, నవాజ్, కృష్ణ, రెవెల్లి మహేశ్, బాపు, తిరుపతి, సురేశ్ రెడ్డి, జోడు శంకర్ పాల్గొన్నారు.

అడ్మిషన్ల వేట..!



"మీ అమ్మాయిని మా కాలేజీలో చేర్పించడానికి ఇప్పుడే సీట్ బుక్ చేసుకోండి. మరికొద్ది రోజులైతే ఫీజు ఎక్కువగా చెల్లించాల్సి వస్తుంది.." అంటూ గత కొద్ది రోజులుగా వచ్చే విద్యాసంవత్సరం ఇంటర్మీడియెట్ కాలేజీల్లో ప్రవేశాల కోసం కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ల వేట సాగిస్తున్నాయి. జిల్లాలో విస్తృతంగా ప్రచారం చేస్తుండగా.. పదో తరగతి ఫలితాలు వెలువడడంతో తల్లిదండ్రులను కలిసి ప్రవేశాల ఎర వేస్తున్నాయి.

- ప్రవేశాల కోసం 'కార్పొరేట్' విద్యా సంస్థల ప్రయత్నాలు
- జిల్లా విద్యార్థులే లక్ష్యంగా ప్రచారం
- సీట్ల కోసం ముందస్తుగానే ఫీజు చెల్లింపులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: విద్యా వ్యాపారంలో పోటీ పెరగడంతో కార్పొరేట్ విద్యాసంస్థలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. తమ సంస్థల్లో విద్యార్థుల ప్రవేశాలే లక్ష్యంగా పోటీ పడుతున్నాయి. జిల్లాలో సింగరేణి పరిధి కార్మిక, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారులు, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులను పలు రకాలుగా ఆకర్షిస్తున్నారు. తమ విద్యాసంస్థల్లో సౌకర్యాలను వివరిస్తూ ఇప్పుడే చేరిపోవాలంటూ కోరుతున్నారు. ఇప్పటికే కొందరు తల్లిదండ్రులు హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ తదితర ప్రాంతాల్లోని పలు కాలేజీలను సందర్శించి వచ్చారు. ఇంకా చాలామంది వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇంటర్‌తోపాటు ఐఐటీ, నీట్, సివిల్స్ ఇతర ఉన్నత విద్య ప్రవేశాల శిక్షణతో సహా ఇంటర్మీడియెట్ విద్యను అందిస్తామని హామీలు ఇస్తున్నారు. తమ విద్యాసంస్థల్లో అనేకమంది ఐఐటీ, ఎన్ఐటీ, నీట్‌లో ర్యాంకులు సాధించారని చెబుతూ ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. తల్లిదండ్రులకు ఫోన్లు, మెసేజీలు, వాట్సాప్‌లో ప్రచారం చేస్తున్నారు.

ప్రవేశాలకు కమీషన్లు

ఆయా సంస్థలు విద్యార్థుల అడ్మిషన్లను బట్టి కమీషన్లు ఇస్తున్నాయి. పీఆర్వోలను నియమించుకుని విద్యార్థుల ఇళ్లకు నేరుగా వెళ్తున్నారు. రూ.లక్షల్లో ఫీజులు చెబుతూ వాయిదాలు, ఫైనాన్స్ సౌకర్యం కూడా కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఉన్నత విద్యాసంస్థల్లో చదివితే భవిష్యత్తులో అవకాశాలు మెరుగు పడతాయనే ఆశతో ఫీజులు చెల్లించేందుకు ఒప్పుకుంటున్నారు. ఎక్కువగా హాస్టల్‌లో చేర్పించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. పదో తరగతికి మార్కులు అధికంగా వచ్చిన విద్యార్థులను వేరే కేటగిరీలో చేర్చుతూ తల్లిదండ్రులను మెప్పిస్తున్నారు. పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులతోనూ ప్రచారం చేయిస్తున్నారు. జిల్లాలో పదో తరగతి విద్యార్థులు 9వేలకు పైగా ఉండగా, ఇంకా అనేక మంది ఇతర జిల్లాల్లోనూ చదివారు. ఎక్కువగా హైదరాబాద్, కరీంనగర్, వరంగల్‌తోపాటు ఇతర నగరాల్లో ఉన్న సంస్థలు అడ్మిషన్లు పొందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో స్థానికంగా ఉన్న చిన్న, మధ్య స్థాయి కాలేజీల పరిస్థితి భిన్నంగా మారింది. ఇక కార్పొరేట్ సంస్థలు కొన్నేళ్లుగా ఇక్కడే తమ బ్రాంచీలను ప్రారంభించాయి. దీంతో ప్రభుత్వ విద్యాసంస్థలపై ప్రతికూల ప్రభావం పడుతోంది. ప్రైవేటు సంస్థలతో పోటీ పడలేక ఏటేటా అడ్మిషన్ల సంఖ్య తగ్గిపోతోంది. మరోవైపు స్కూల్ విద్యార్థులను సైతం చేరికకు ప్రైవేటు విద్యాసంస్థలు పోటీ పడుతున్నాయి. ప్రీ కిడ్స్ నుంచి మొదలు పది వరకు, ఎస్ఎస్‌సీ, సీబీఎస్ఈ, ఇంటర్నేషనల్ సిలబస్ అంటూ అనేక స్కూళ్ల యాజమాన్యాలు ప్రచారం మొదలుపెట్టాయి. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయి స్కూళ్లు మూతపడే పరిస్థితి వస్తోంది. సెలవులకు ముందు ప్రభుత్వ టీచర్లు అడ్మిషన్ల కోసం ప్రచారం చేసినప్పటికీ ప్రస్తుతం చేయడం లేదు. ఇదే సమయంలో ప్రైవేటు సంస్థలు విస్తృతంగా ప్రచారం చేస్తూ విద్యార్థులను చేర్పించుకుంటున్నాయి.

సమస్యలు లేకుండా చూస్తాం



సివిల్ సప్లయి అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- కొనుగోలు కేంద్రాల సందర్శన

దండేపల్లి: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు లేకుండా, కొనుగోళ్ల వేగవంతం చేయడంతోపాటు లోడింగ్, అన్‌లోడింగ్‌లో ఆలస్యం కాకుండా, గన్నీ సంచులు అందుబాటులో ఉంచేలా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మండలంలోని ముత్యంపేట, నెల్కివెంకటాపూర్, దండేపల్లి, పాతమామిడిపల్లి, ధర్మరావుపేట, వెల్గనూర్ గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన సందర్శించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగారు. బస్తాలను మిల్లులకు తీసుకెళ్లిన లారీలు అన్‌లోడ్ కాక రోజుల తరబడి అక్కడే ఉంటున్నాయని, దీంతో కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన బస్తాలు లారీలు రాక ఇక్కడే ఉండి పోతున్నాయని నిర్వాహకులు చెప్పారు. కలెక్టర్ వెంటనే సివిల్ సప్లయ్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అన్‌లోడింగ్ ఆలస్యం కాకుండా చూడాలని, వీలయితే పక్క జిల్లాల మిల్లులకు ట్యాగింగ్ ఇచ్చి అక్కడికి పంపించాలని సూచించారు. లోడింగ్, అన్‌లోడింగ్‌లో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. వెల్గనూర్ కొనుగోలు కేంద్రంలో గన్నీ సంచుల సమస్య ఉందని, లారీలు కూడా సరిగా రావడం లేదని చెప్పడంతో.. సమస్యలన్నీ తీరుస్తామని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నీ వేగవంతంగా జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అక్కడి నుంచి కన్నెపల్లి రైస్‌మిల్ వద్దకు వెళ్లారు. ధాన్యం లోడ్‌తో నిలిచి ఉన్న లారీలను చూసి వెంటనే అన్‌లోడింగ్ చేయాలని సూచించారు. డీఆర్‌డీవో కిషన్, తహసీల్దార్ సంధ్యారాణి, ఆర్ఐ భూమన్న, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలి

మంచిర్యాలటౌన్: వేసవిలో విద్యతోపాటు కళలు, చిత్రలేఖనం, పెయింటింగ్ శిక్షణకు వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్యతో కలిసి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ శిబిరాల నిర్వహణకు జిల్లాలోని 50 పాఠశాలలు సిద్ధంగా ఉన్నాయని, 15 రోజుల పాటు శిబిరాలు నిర్వహించాలని, ఒక్కో శిబిరానికి రూ.50 వేలు అందిస్తామని తెలిపారు. ప్రతీ శిబిరంలో 100 మంది విద్యార్థులకు శిక్షణ అందించాలని తెలిపారు. ప్రతీరోజు ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు.

నిషేధాజ్ఞల అమలు పొడగింపు

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అమలులో ఉన్న నిషేధాజ్ఞలను పొడగిస్తూ సీపీ అంబర్ కిషోర్ ఝూ ఒక ప్రకటన విడుదల చేశారు. కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో ఈ నెల 1నుంచి ఫిబ్రవరి 1వరకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అనుమతి లేకుండా డీజే, డ్రోన్ కెమెరాలు వినియోగించడం నిషేధించినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'పది'లో 'లెక్క' తప్పింది..!

- తెలుగులో అంచనాలు తలకిందులు
- జిల్లాలో 318 మంది ఫెయిల్
- గణితంలో 166 మంది..

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి పరీక్షల్లో గణితం సబ్జెక్టులో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల లెక్క తప్పింది. ఎక్కువ మంది లెక్కల సబ్జెక్టులోనే ఫెయిల్ కావడం గమనార్హం. అధిక మార్కులు సాధించే అవకాశం ఉండడంతో విద్యార్థులు ఎక్కువ దృష్టి సారించేవారు. గణితం సబ్జెక్టుకు పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు ఉన్నా లెక్కల్లోనే తికమకపడ్డారని తెలుస్తోంది. రెండు మూడు ప్రశ్నలు విద్యార్థుల స్థాయికి మించి(ప్రశ్నలు పెద్దగా ఉండడం) రావడం వల్ల అనుకున్న రీతిలో మార్కులు సాధించలేకపోయారు. పాఠశాలలకు సక్రమంగా హాజరు కాని విద్యార్థులే లెక్కల్లో తప్పినట్లు టీచర్లు చెబుతున్నారు. గణితం తర్వాత తెలుగు సబ్జెక్టులో ఎక్కువ మంది ఫెయిల్ కావడం గమనార్హం. జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో 9,179మంది విద్యార్థులకు గాను 8,861మంది ఉత్తీర్ణత సాధించారు. 318మంది అనుత్తీర్ణులయ్యారు. సబ్జెక్టుల వారీగా పరిశీలించి చూస్తే గణితం తర్వాత తెలుగులోనే ఎక్కువగా ఫెయిలైన విద్యార్థులు ఉన్నారు. 166మంది గణితంలో ఫెయిల్ కాగా, తెలుగులో 143మంది విద్యార్థులు అనుత్తీర్ణులయ్యారు. సైన్స్‌లో 53మంది, ఇంగ్లిషులో 38మంది ఫెయిలయ్యారు. తెలుగు మీడియం నుంచి ఇంగ్లిషు మీడియంలోకి మార్చడం వల్ల తెలుగు సబ్జెక్టులో వెనుకబడిపోయినట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రం మంచిర్యాలలోని బాలుర ఉన్నత పాఠశాలలోనే అత్యధికంగా గణితం సబ్జెక్టులో 12మంది, తాళ్లపేట్ ఉన్నత పాఠశాలలో తెలుగులో ఏడుగురు విద్యార్థులు ఫెయిలయ్యారు. గత ఏడాది తెలుగులో 312మంది, గణితంలో 227మంది విద్యార్థులు అనుత్తీర్ణులు కాగా.. ఈ ఏడాది ముందు వరుసలో గణితం తర్వాతి వరుసలో తెలుగులో తప్పారు.

'ఉపాధి'లో పండ్ల తోటలు

- జిల్లాలో 400 ఎకరాలు లక్ష్యం
- రైతులు ముందుకు రావాలని అధికారుల సూచన

చెన్నూర్‌రూరల్: కూలీలకు ఉపాధి కల్పించడంతోపాటు ఉపాధి హామీ పథకం కింద ఉద్యానవనాల పెంపకం చేపట్టేలా ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 400 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి నిర్ణయించింది. జిల్లాలో 16మండలాలు ఉండగా.. మండలానికి 25ఎకరాల చొప్పున పండ్ల మొక్కలు పెంచేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఏప్రిల్ నుంచే దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. వానాకాలం, యాసంగి పంటలు ముగిసినందున ఎవరైనా ఆసక్తి కలిగిన చిన్న, సన్నకారు రైతులు ముందుకు వస్తే ప్రోత్సాహం అందించనున్నారు. ఉద్యానవన పంటల సాగులో భాగంగా మామిడి, బత్తాయి, నారింజ, జామ, సీతాఫలం, యాపిల్, కొబ్బరి, దానిమ్మ, మునగ, చింత, ఆయిల్‌ఫాం వంటివి రైతులు తమ భూముల పరిస్థితికి అనుగుణంగా ఎంపిక చేసుకోవచ్చు. ఏదైనా ఒకే రకం సాగు చేసుకోవాల్సి ఉండగా.. అందుకు నిర్ణీత ధరలు చెల్లిస్తారు. రైతులు తమకు నచ్చిన నర్సరీల్లో ఎంపిక చేసుకోవచ్చు లేని పక్షంలో ప్రభుత్వం ఎంపిక చేసిన నర్సరీల నుంచి తీసుకోవచ్చు. స్వయంగా కొనుగోలు చేస్తే వారి ఖాతాల్లో నగదు జమ చేస్తారు. ముందస్తుగా బిందు సేద్యానికి దరఖాస్తు చేసుకుంటే 90శాతం సబ్సిడీపై పరికరాలు అందజేస్తారు.



కిష్టంపేటలో ఉపాధిహామీ పథకం ద్వారా పెంచిన మామిడి చెట్లు

ధ్రువీకరణ పత్రాలు

చిన్న, సన్నకారు రైతులు ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కలిగి ఉండి పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్ ఇవ్వాలి. వ్యవసాయ పొలాల వద్ద నీటి వసతి కలిగి ఉండాలి. ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి ఉద్యానవనాలు మంజూరు చేస్తారు. మొక్కలకు నిధులతోపాటు గుంతలు తీయడం, మొక్కలు నాటడం వంటి పనులు ఉపాధి హామీ పథకం కిందనే చేపడుతారు.

రైతులు దరఖాస్తు చేసుకోవాలి



ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలి. ఉద్యావన పంటలతో రైతులు మంచి లాభాలు పొందవచ్చు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 400 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి లక్ష్యం ఉంది. రైతులు ముందుకు రావాలి.

– కిషన్, డీఆర్డీవో, మంచిర్యాల

రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించండి..

- వీధి దీపాలు వెలుగడం లేదు..
- కమిషనర్‌తో ఫోన్ ఇన్‌లో సమస్యల వెల్లువ

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాల్టీ కార్పొరేషన్‌గా మారి మూడు నెలలు పూర్తయినా మంచిర్యాలతోపాటు విలీన మున్సిపాలిటీ నస్పూర్, హాజీపూర్ మండలంలోని ఎనిమిది గ్రామాల్లో వీధి దీపాలు వెలుగడం లేదు. డ్రెయినేజీలు నిర్మించాలి. పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చి ప్రతీ రోజు చెత్త తీసుకెళ్లేలా చూడాలి.. అంటూ పలువురు గురువారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్‌ఇన్‌లో మంచిర్యాల నగరపాలక సంస్థ కమిషనర్ శివాజీ దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు మరీ అధ్వానంగా ఉన్నాయని, ఆన్‌లైన్ సేవలు సక్రమంగా అందడం లేదని ఫిర్యాదు చేశారు.

ప్రశ్న: మా కాలనీల్లో వీధి దీపాలు వెలుగడం లేదు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. పాములు, విషసర్పాలతో భయభ్రాంతులకు గురవుతున్నాం. – మంచు సత్తయ్య(శ్రీనివాస కాలనీ), నజార్, కృష్ణకాలనీ(నస్పూర్), మల్లేశ్, గర్మిళ్ల, సత్యనారాయణ(వేంపల్లి), సత్యనారాయణ(ముల్కల్ల), వెంకట్(వేంపల్లి)

కమిషనర్: వీధి దీపాల కోసం ఇటీవల టెండర్ల ప్రక్రియ చేపట్టాం. వారం రోజుల్లో టెండర్లు తెరిచి వెంటనే వీధి దీపాలను కార్పొరేషన్ పరిధిలోని అన్నిచోట్ల ఏర్పాటు చేయిస్తాం.

ప్రశ్న: తాగునీటి పైపులైన్ లీకేజీ అవుతోంది. రోడ్డుపై నీరు నిలిచి ఇబ్బందిగా మారుతోంది. రోడ్లు ఉన్నా డ్రెయినేజీలు లేక మురుగు నీరు రోడ్లపైకి వచ్చి చేరుతోంది. – మధుసూదన్(అర్కలవాడ, మంచిర్యాల), వెంకటయ్య(లక్ష్మీనగర్, మంచిర్యాల), సత్తయ్య (శ్రీశ్రీనగర్, మంచిర్యాల), హబీబ్(జాఫర్‌నగర్, మంచిర్యాల)

కమిషనర్: తాగునీటి పైపులు లీకేజీలు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాం. అర్కలవాడకు లైన్‌మెన్‌ను వెంటనే పంపించి లీకేజీ సమస్య పరిష్కరిస్తాం. రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు ఎక్కడెక్కడ అవసరమనే వివరాలు సేకరిస్తున్నాం. ప్రణాళిక రూపొందించి నిధుల విడుదలను బట్టి నిర్మాణాలు చేపడుతాం.

ప్రశ్న: డ్రెయినేజీపై కంపౌండ్ వాల్ నిర్మించడంతో నీరు పారడం కష్టంగా మారింది.

– మహ్మద్ అనీసుల్లా, ఇస్లాంపుర, మంచిర్యాల

కమిషనర్: కార్పొరేషన్ నిర్మించిన కట్టడాలు, డ్రెయినేజీలను ఆక్రమించి ఏ కట్టడం ఉన్నా వాటిని పరిశీలించి తొలగిస్తాం. వెంటనే ఆయా కట్టడాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: రైల్వే గేటు దగ్గర చెత్త కుప్పలుగా పోసి ఉంచుతున్నారు. ఈ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది. – ఓంప్రకాశ్, హమాలివాడ

కమిషనర్: చెత్త నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించేలా చూస్తాం. చెత్త తొలగించకుంటే వెంటనే మా దృష్టికి గానీ వార్డు ఆఫీసర్ల దృష్టికి గానీ తీసుకొస్తే చర్యలు చేపడుతాం.

ప్రశ్న: కాలేజీరోడ్డులో ఆకతాయిల ఆగడాలు ఎక్కువ అవుతున్నాయి. ఉదయం వాకింగ్ వెళ్లే వారితోపాటు కాలేజీకి వెళ్లే అమ్మాయిలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. – చింతకింది పద్మావతి, ఎన్టీఆర్‌నగర్, మంచిర్యాల

కమిషనర్: పోలీసు శాఖ వారి దృష్టికి తీసుకెళ్లి ఆకతాయిల ఇబ్బందులు లేకుండా చూస్తాం.



శివాజి, మంచిర్యాల నగరపాలక సంస్థ కమిషనర్

ప్రశ్న: రోడ్లు లేవు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. వారం రెండ్రోజులే చెత్తబండి వస్తోంది. నాలుగు రోజులు వచ్చేలా చూడాలి

– సుధీర్‌కుమార్, రాయల్ టాకీస్, నస్పూర్, ఎం.కుమార్, విద్యానగర్, నస్పూర్‌కాలనీ

కమిషనర్: నస్పూరు పరిధిలో రోడ్లు వేసేందుకు ఒక ప్యాకేజీలా రూపొందించి ప్రభుత్వానికి పంపించాం. అనుమతులు రాగానే ఆ ప్రాంతంలో రోడ్లు వేస్తాం. తాగునీటి సమస్య లేకుండానే చూస్తున్నాం. రాయల్‌టాకీస్ ఏరియాలో తాగునీటి సమస్యను గుర్తించి పరిష్కరిస్తాం. చెత్తబండి రెగ్యులర్‌గా వచ్చేలా చర్యలు తీసుకుంటాం. తడిపొడి చెత్త వేరు చేసి ఇచ్చేలా ప్రజలు సహకరించాలి.

ప్రశ్న: సుభాష్‌నగర్‌లో కల్వర్టు లేక డ్రెయినేజీ నీరు రోడ్డుపై పారుతోంది. హమాలీవాడ హనుమాన్ టెంపుల్ నుంచి బాలమల్లు తోట వరకు డ్రెయినేజీ వ్యవస్థ లేక ప్రజల రాకపోకలకు ఇబ్బంది మారింది.

– చందు, సుభాష్‌నగర్, మంచిర్యాల, శ్రీరాముల మల్లేశ్, హమాలీవాడ

కమిషనర్: కల్వర్టు లేక డ్రెయినేజీ నీరు పారకపోతే పరిశీలించి కల్వర్టు నిర్మిస్తాం. ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఇంజినీరింగ్ అధికారులను పంపించి పరిశీలిస్తాం. డ్రెయినేజీ నిర్మాణాలు పదిహేను రోజుల్లో ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: పాతమంచిర్యాలలో డ్రెయినేజీలు శుభ్రంగా లేవు. సమయం లేకుండా తాగునీటి సరఫరా చేయ దం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శ్రీశ్రీనగర్‌లో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి.

– పెంట శ్రీనివాస్, పాతమంచిర్యాల, లక్ష్మి, శ్రీశ్రీనగర్

కమిషనర్: డ్రెయినేజీలు శుభ్రం చేసేందుకు ఇప్పటికే ప్రణాళిక రూపొందించాం. తాగునీరు ఒకే సమయానికి సరఫరాకు చర్యలు తీసుకుంటాం. రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. వీలైనంత త్వరగా నిర్మాణం చేపడుతాం.

ప్రశ్న: చున్నంబట్టి రోడ్డులోని వంద ఫీట్ల రోడ్డులో వాటర్ ట్యాంకు కట్టేందుకు గుంత తవ్వి వదిలేయడం వల్ల ప్రమాదకరంగా మారింది. గుంతను పూడ్చాలి.

– ఉపేందర్ తుంగపల్లి, మందమర్రి

కమిషనర్: వెంటనే గుంత పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: నర్సరీతో కోతుల బెడద, పాములు, విషపు సర్పాలు వస్తున్నాయి. ఆరో వార్డులో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. – సతీశ్‌కుమార్, హైటెక్‌సిటీ కాలనీ, మంచిర్యాల, అర్కల హేమలత, 6వ వార్డు

కమిషనర్: హైటెక్‌సిటీ కాలనీ నర్సరీ ద్వారా కోతులు, విష సర్పాలు స్థానికుల ఇళ్లకు రాకుండా చర్యలు తీసుకుంటాం. కుక్కల బెడద తగ్గించేందుకు ఇ ప్పటికే చర్యలు తీసుకుంటున్నాం. అన్ని వార్డుల్లో యానిమల్ కేర్ సెంటర్ ద్వారా చర్యలు చేపడుతాం.

ప్రశ్న: హైటెక్‌సిటీ కాలనీలో రోడ్లు గుంతలుగా ఉన్నాయి. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నుంచి మురుగు నీరు రోడ్లపైకి పారుతోంది. తాగునీరు సన్నగా రావడం వల్ల సరిపోవడం లేదు. ఎక్కువ సమయంతోపాటు నీరు బాగా వచ్చేలా చూడాలి.

– తౌటం సరళ, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, ప్రకాశ్, రవికుమార్, హైటెక్‌సిటీ కాలనీ

కమిషనర్: హైటెక్‌సిటీ కాలనీలో రోడ్ల నిర్మాణానికి నిధుల కేటాయింపునకు ప్రయత్నిస్తున్నాం. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలో సమస్య వల్ల అక్కడక్కడ మురుగు నీరు లీకేజీతో రోడ్లపైకి వస్తోంది. దీని పరిష్కారానికి ప్రయత్నిస్తున్నాం. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూస్తాం.

ప్రశ్న: వీధి దీపాల సమస్య తీర్చండి. ఉన్న లైట్లు తక్కువ వెలుతురుతో వస్తున్నాయి. వెలుతురు ఎక్కువగా వచ్చే దీపాలు ఏర్పాటు చేయాలి.

– సదానందం(గొల్లవాడ మంచిర్యాల), తిరుపతిరెడ్డి(అశోక్‌రోడ్డు), మల్లేశ్(గర్మిళ్ల), రావి సురేశ్ (ఆవోపా కాలనీ, మంచిర్యాల)

కమిషనర్: వీధి దీపాల ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. వారం రోజుల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయించేలా చూస్తాం.

ప్రశ్న: ప్రాపర్టీ ట్యాక్స్ ఆన్‌లైన్ లేక ఇబ్బందిగా ఉంది. ఆన్‌లైన్ చేసేలా చర్యలు తీసుకోండి.

– గజ్జల రాజశేఖర్, ముల్కల్ల

కమిషనర్: విలీన గ్రామాలకు సంబంధించిన వాటి ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తవుతుంది. ప్రాపర్టీ ట్యాక్స్ తోపాటు ఇతర సదుపాయాలు ఆన్‌లైన్ ద్వారా జరిగేలా చూస్తాం.

క్లుప్తంగా

పానీపూరి తిని ఆరుగురికి అస్వస్థత

బెల్లంపల్లి: పానీపూరి తిని ఆరుగురు అస్వస్థతకు గురైన సంఘటన బెల్లంపల్లిలో చోటు చేసుకుంది. బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియాకు చెందిన కాదసి త్రిషిక, సీహెచ్.వాషిత, అక్షయని, శ్రీకాంత్, ఎం.సంగీతదేవి, అనుప్రియ బుధవారం రాత్రి పానీపూరి తిన్నారు. వీరంతా ఒకరి తర్వాత ఒకరు వాంతులు, విరేచనాలు చేసుకోవడంతోపాటు కడుపు నొప్పితో బాధపడుతూ అదేరోజు అర్ధరాత్రి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లారు. వీరికి చికిత్స అందించడంతో బాధితుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యుడు సకారాం తెలిపారు. పానీపూరి ఫుడ్‌పాయిజన్‌తో అస్వస్థతకు గురైనట్లు చెబుతున్నారు.

పోక్సో కేసులో ఒకరికి పదేళ్ల జైలు

ఆసిఫాబాద్: పోక్సో కేసులో ఒకరికి పదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవి రమేశ్ గురువారం తీర్పుచెప్పారు. లింగాపూర్ ఎస్సై చంచు గంగన్న కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ తాలూకా పాడ్రి గ్రామానికి చెందిన ఓ మహిళకు ముగ్గురు కూతుళ్లు. తనతల్లిగారి గ్రామమైన లింగాపూర్ మండలం వంజరిగూడలో ముగ్గురు కూతుళ్లు నివసిస్తున్నారు. పెద్ద కుమార్తె (మైనర్) అనారోగ్యంతో 2019 జులై, 24న తల్లి..ఆదిలాబాద్ ఆసుపత్రికి తీసుకెళ్లింది. వైద్యపరీక్షల అనంతరం 7 నెలల గర్భిణి అని వైద్యులు నిర్ధారించారు. తల్లి కూతురిని అడుగగా వంజరిగూడకు చెందిన కేంద్రె చంద్రకాంత్ తనను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి పలుమార్లు లైంగికదాడి చేశాడని చెప్పింది. తల్లి ఫిర్యాదుతో అప్పటి ఎస్‌హెచ్‌వో తిరుపతి కేసు నమోదు చేశారు. ఈక్రమంలో సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి పీపీ జగన్మోహన్‌రావు నేరం రుజువు చేయడంతో న్యాయమూర్తి తీర్పు చెప్పారు. నిందితులకు శిక్షపడేలా కృ చేసిన లైజనింగ్ అధికారి పి.రాంసింగ్, ఏఎస్పీ చిత్తరంజన్, జైనూర్ సీఐ రమేశ్, లింగాపూర్ ఎస్సై గంగన్నను ఎస్పీ డివి శ్రీనివాసరావు అభినందించారు.


మేడే రోజూ కూలీలకు 'పని'



పెద్దంపేటలో ఉపాధి పనుల్లో ఈజీఎస్ కూలీలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మేడే వేడుకలు జరుపుకుంటున్న కార్మికులు ఓవైపు సంతోషంగా ఉండగా హాజీపూర్ మండలం పెద్దంపేటలోని ఈజీఎస్ కూలీలు పనుల్లో మునిగిపోయారు. ఈజీఎస్ నిర్వాహకులు వారితో ఉపాధి పనులు చేయించారు. కార్మిక దినోత్సవ వేళ ప్రభుత్వ సెలవు ఉండగా ఇలా పనులు చేయించడంపై కార్మిక సంఘాల నాయకులు మండిపడ్డారు. కాగా ఈజీఎస్ ఏపీవోను వివరణ కోరగా ఇటీవల పనిచేసిన దినాల్లో కొలతలు తక్కువ ఉండటంతో వాటిని సరిచేసేందుకు ఏడుగురు కూలీలు స్వచ్ఛందంగా వెళ్లారన్నారు. కార్మిక సెలవు కారణంగా ఎవరికీ ఎలాంటి మస్టర్ వేయలేదని తెలిపారు.

సీపీఆర్ఎంఎస్‌లో గందరగోళం



శ్రీరాంపూర్: సింగరేణిలో రిటైర్డ్ అయిన కార్మికులకు మెరుగైన కార్పొరేట్ వైద్యం అందించేందుకు సంస్థ కాంట్రీబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికల్ స్కీం(సీపీఆర్ఎంఎస్) సదుపాయం కల్పించింది. ఈ స్కీం కింద హెల్త్‌కార్డులు పొందిన కార్మికులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. తమకు కార్డులో ఎంత మొత్తం ఖర్చయిందో, ఇంకా ఎంత మిగిలి ఉందో తెలియక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కార్మికులకు ఈ స్కీం కింద చేరాలంటే రూ.60 వేలు ముందుగా చెల్లించాలి. గతంలో ఈ మొత్తం రూ.40 వేలుగా మాత్రమే ఉండేది. ఈ మొత్తాన్ని సర్వీసులో ఉండగానే రికవరీ చేస్తారు. ఈ స్కీం రాక ముందు రిటైర్డ్ అయిన వారు తర్వాత డబ్బులు చెల్లిస్తే వారికి కూడా కార్డులు అందించారు. ఈ కార్డు కింద రిటైర్డ్ కార్మికునికి, ఆయన భార్యకు కలిపి రూ.8 లక్షల వైద్యం చేయించుకోవచ్చు. ఈ మొత్తం ఖర్చయితే ఇక అంతే. మళ్లీ రూ.60 వేలు చెల్లిస్తామన్నా కూడా కార్డు ఇవ్వరు. వన్‌టైం కిందే కార్డు ఇస్తారు. సింగరేణి పరిసర ప్రాంతాల్లోని ప్రముఖ ఆసుపత్రులు, కరీంనగర్, వరంగల్, ఖమ్మంతోపాటు హైదరాబాద్‌లోని పలు కార్పొరేట్ ఆసుపత్రులతో కంపెనీ ఈ కార్డుతో చికిత్స అందించేలా అనుసంధానం చేసుకుంది. ఆ ఆసుపత్రులకు కార్డు పట్టుకుని రిటైర్డ్ కార్మికుడు వెళ్తే క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ అందుతుంది. భార్యాభర్తలిద్దరికి కలిపి రూ.8 లక్షల విలువ గల చికిత్స పొందవచ్చు.

బ్యాలెన్స్ వివరాలు లేవు..

రిటైర్డ్ కార్మికుడు అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరినప్పుడు ముందుగా అతను అక్కడ కార్డు చూపించి అడ్మిట్ అవుతారు. దాని ప్రకారం ట్రీట్‌మెంట్ చేయడానికి ముందు సదరు ఆసుపత్రి యాజమాన్యం కంపెనీ సీఎంఓకు వైద్య ఖర్చుల బిల్లులను ఎస్టిమేట్ చేసి పంపుతారు. అక్కడి నుంచి అప్రూవల్ వచ్చిన తర్వాతే ట్రీట్‌మెంట్ మొదలవుతుంది. ఐతే ట్రీట్‌మెంట్ జరిగిన తర్వాత సదరు రిటైర్డ్ ఉద్యోగికి తన కార్డులో ఎంత మొత్తం ట్రీట్‌మెంట్ కింద కట్ అయిందో తెలియడం లేదు. కంపెనీ వారు చెప్పడం లేదు. ఆసుపత్రి వారు చెప్పే అంచనే తప్ప, డిశ్చార్జి అయిన తర్వాత తన వైద్యానికి ఆసుపత్రుల్లో కార్డు నుంచి ఎంత మొత్తం కట్ అయిందో తెలియక వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఏ కార్యాలయం వద్దకు వెళ్లి అడిగిన కూడా వివరాలు ఇవ్వడం లేదు. మళ్లీ ఏదైనా జబ్బు పడ్డప్పుడు దానికి సరిపడా డబ్బులు కార్డులో ఉన్నాయా లేవో అని గందరగోళపడుతున్నారు.

ఎస్ఎంఎస్ అలర్ట్ పెట్టాలి



రిటైర్డ్ కార్మికుడు ఆసుపత్రిలో డిశ్చార్జి అయిన వెంటనే అతని సెల్‌ఫోన్‌కు ఎంత మొత్తం కార్డు నుంచి వైద్యానికి కట్ అయిందో వారి ఫోన్‌కు మెసేజ్ వచ్చేలా యజమాన్యం ఏర్పాటు చేయాలి. కనీసం జీఎం కార్యాలయానికి వెళ్లి అడిగిన అక్కడ వివరాలు చెప్పేలా ఏర్పాటు చేయాలి. ఇవేవి లేకపోవడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

– నాతాడి శ్రీధర్‌రెడ్డి, బీఎంఎస్ ఎస్సార్పీ బ్రాంచి ఉపాధ్యక్షుడు

నరేందర్‌కు శ్రమశక్తి అవార్డు



సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న నరేందర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే–5 గనిలో విధులు నిర్వర్తిస్తున్న రాంశెట్టి నరేందర్‌ను మేడే సందర్భంగా ప్రభుత్వం శ్రమశక్తి అవార్డుకు ఎంపిక చేసింది. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రబారతిలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర కనీసవేతనాల సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ చేతుల మీదుగా అవార్డుతోపాటు ప్రశంసపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ శ్రమశక్తి అవార్డు ప్రదానం చేసినందుకు ప్రభుత్వానికి రుణపడి ఉంటానన్నారు. తనకు సహకరించిన ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్, నాయకులు కాంపెల్లి సమ్మయ్య తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలల్లో మరమ్మతు పూర్తిచేయాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
- ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సెలవులు ముగియకముందే మరమ్మతు పూర్తిచేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాల డీఈలు, ఏఈలతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో, ఏజెన్సీ గ్రామాల్లో చేపడుతున్న మరమ్మతులు ఎంతవరకు పూర్తి చేశారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న గేట్లను, ఆర్వో ప్లాంట్ల మరమ్మతు చేయించాలని సూచించారు. భోజనశాలల భవనాల షెడ్ల నిర్మాణాలు వెంటనే పూర్తిచేయాలన్నారు. అదనపు తరగతి గదులు నిర్మించాలని, అంగన్‌వాడీ మోడల్ స్కూల్, మరుగుదొడ్లు, సెప్టిక్ ట్యాంక్, డార్మెంటరీ గదుల మరమ్మతు పూర్తి చేయాలని ఆదేశించారు. పీహెచ్‌సీల్లో గదుల నిర్మాణాలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఈఈ తానాజీ, డీఈ శివప్రసాద్, ఏఈలు పాల్గొన్నారు.

అధికార లాంఛనాలతో సీఆర్పీఎఫ్ జవాన్ అంత్యక్రియలు

- హాజరైన సీఆర్పీఎఫ్ అధికారులు, జవాన్లు



సాగర్ పాడె మోస్తున్న సీఆర్పీఎఫ్ అధికారులు



అధికార లాంఛనాలతో అంత్యక్రియలు చేస్తున్న సీఆర్పీఎఫ్ అసిస్టెంట్, జవాన్లు

భీమారం: గుండెపోటుతో మృతిచెందిన సీఆర్పీఎఫ్ జవాన్ రామళ్ల సాగర్‌కు అధికార లాంఛనాలతో గురువారం భీమారంలో అంత్యక్రియలు నిర్వహించారు. భీమారం మండలకేంద్రానికి చెందిన సాగర్ సీఆర్పీఎఫ్ జవాన్‌గా శిక్షణ పొందుతున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. బుధవారం ఆయన మంచిర్యాలలో ఫంక్షన్‌కు వెళ్లగా గుండెపోటుతో మృతిచెందాడు. హకీంపేట్‌లోని సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రాకేశ్ దేహార్య, జవాన్లు అంత్యక్రియలకు హాజరై తల్లిదండ్రులు గట్టయ్య, కళ, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంతిమయాత్రలో అధికారులు పాల్గొని పాడె మోశారు. శ్మశాన వాటికలో మృతదేహానికి జాతీయజెండా కప్పి పూలమాలలు వేశారు. అనంతరం మూడు రౌండ్లు గాల్లో కాల్పులు జరిపి నివాళులర్పించారు. అంత్యక్రియలకు గ్రామస్తులు తరలివెళ్లారు.

సంక్షేమాధికారులకు పోస్టింగ్

- ఎస్సీ వసతిగృహాల్లో నియామకం
- కాళేశ్వరం జోన్‌లో 19మంది రిపోర్టు



నియామకపత్రాలు అందజేస్తున్న ఎస్సీ డీడీ రవీందర్‌రెడ్డి, ఏఎస్‌డబ్ల్యూవో రవీందర్‌గౌడ్

మంచిర్యాలఅర్బన్: ఎస్సీ వసతిగృహా సంక్షేమాధికారులుగా ఎంపికై పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులకు మంచిర్యాల జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రవీందర్‌రెడ్డి బుధవారం రాత్రి నియామక పత్రాలు అందజేశారు. గత ఏడాది జూన్ 24నుంచి 29వరకు కంప్యూటర్ ఆధారిత(సీఆర్‌బీటీ) విధానంలో పరీక్షలు నిర్వహించగా సెప్టెంబర్ 20న ఫలితాలు విడుదలయ్యాయి. కాళేశ్వరం జోన్ పరిధిలో 24మంది అభ్యర్థులను టీజీపీఎస్సీ ఎంపిక చేసిన పంపగా.. ఐదుగురు అభ్యర్థులు వివిధ కారణాలతో ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు రాలేదు. దీంతో 19మందికి నియామక పత్రాలు అందజేయగా.. గురువారం కేటాయించిన వసతిగృహాల్లో రిపోర్టు చేశారు. వీరిలో 12మంది పురుషులు, ఏడుగురు మహిళలు ఉన్నారు. మంచిర్యాల జిల్లాకు 8, పెద్దపల్లికి 5, ఆసిఫాబాద్‌కు 4, ములుగుకు 1, జయశంకర్ భూపాలపల్లికి 1 అభ్యర్థిని ఎస్సీ వసతిగృహా సంక్షేమ అధికారులుగా ప్రభుత్వ నిబంధనలను అనుసరించి అభ్యర్థుల ఆప్షన్ల మేరకు పోస్టింగ్‌లు కేటాయించారు.

కాళేశ్వరం జోన్‌లో ఇలా..

అభ్యర్థి పేరు	కేటాయించిన పోస్టింగ్
మంచిర్యాల జిల్లాలో..	
యాసం శ్రీనివాస్	ఎస్సీ బాయ్స్‌హాస్టల్, కోటపల్లి
చీపెల్లి శ్రీనివాస్	ఎస్సీ బాయ్స్ హాస్టల్, మందమర్రి
చండి రజనీకాంత్	ఎస్సీ బాయ్స్ హాస్టల్, తాండూర్
చిందికింది ప్రశాంత్	ఎస్సీ బాయ్స్ హాస్టల్, దండేపల్లి
అల్గునూరి భార్గవ్	ఎస్సీ బాయ్స్ హాస్టల్, చెన్నూర్
డి.శ్రీనివాస్	ఎస్సీ బాయ్స్ హాస్టల్, చింతగూడ
టి.రాజు	ఎస్సీ కాలేజ్ బాయ్స్ హాస్టల్, బెల్లంపల్లి
సద్గుణ, కూడెల్లి	ఎస్సీ గర్ల్స్ హాస్టల్, లక్సెట్టిపేట
ఆసిఫాబాద్ జిల్లా..	
రాహుల్‌కుమార్	ఎస్సీ కాలేజీ బాయ్స్ హాస్టల్, ఆసిఫాబాద్
జలంపల్లి ప్రేమ్‌కుమార్	కాలేజీ బాయ్స్ హాస్టల్, కాగజ్‌నగర్
ఈశ్వరి	ఎస్సీ కళాశాల గర్ల్స్ హాస్టల్, ఆసిఫాబాద్
రత్నం కవిత	ఎస్సీ కాలేజీ గర్ల్స్ హాస్టల్ కాగజ్‌నగర్
పెద్దపల్లి, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో..	
తోట శైలజ	ఎస్సీ ఐడబ్ల్యూహెచ్‌సీ(గర్ల్స్), పెద్దపల్లి
ఇసంపల్లి రమ్య	ఎస్సీ గర్ల్స్ హాస్టల్, మంథని
ప్రశాంత్	ఎస్సీ ఐడబ్ల్యూహెచ్‌సీ బాయ్స్ హాస్టల్, మంథని
డి.తిరుపతి	ఎస్సీడబ్ల్యూహెచ్‌సీ బాయ్స్ హాస్టల్, మంథని
సాధుల రమేష్	ఎస్సీ కాలేజీ బాయ్స్ హాస్టల్, మంథని
ఎ.స్వాతి	ఎస్సీ గర్ల్స్ హాస్టల్ రేగోండ
డి.మమత	ఎస్సీ గర్ల్స్ హాస్టల్, ఏటూరునాగారం

ఇసుక రాయల్టీ తీసుకున్న వీడీసీ సభ్యులపై కేసు



వెల్లడిస్తున్న జైనథ్ సీఐ సాయినాథ్

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): ఇసుక రాయల్టీ తీసుకున్న పెండల్‌వాడ, సాంగ్వి వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు. గురువారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. గతనెల 13న భోరజ్ మండలం పెండల్‌వాడ గ్రామ శివారులో పెన్‌గంగా నది నుంచి ఇసుక తీసుకోవడానికి ట్రాక్టర్ డ్రైవర్ వచ్చాడు. వీడీసీ సభ్యులు భూమారెడ్డి, అతని సోదరుడు రామ్‌రెడ్డి తోపాటు మరికొంత మంది సభ్యులు అతని వద్ద రూ.500 రాయల్టీ అక్రమంగా తీసుకున్నారు. దీంతోపాటు ఆయనతో దుర్భాషలాడి బెదిరించారు. సాంగ్వి గ్రామంలో ఇసుక తరలింపులో వసూళ్లకు పాల్పడుతున్న అశోక్, మరికొందరిపై ట్రాక్టర్ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదుతో జైనథ్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు అక్రమ దందాలు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

దగ్ధమైన జొన్నపంట పరిశీలన



ఘటనస్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ గ్రామానికి చెందిన 11 మంది రైతులకు సంబంధించిన పదెకరాల్లో ప్రమాదవశాత్తు దగ్ధమైన జొన్న పంటను తహసీల్దార్ శ్యాంసుందర్ గురువారం పరిశీలించారు. జొన్న పంటతోపాటు రెండు టార్పాలిన్, 40 స్ప్రింక్లర్లు, 85 పైపులు, 27 స్ప్రింక్లర్ నౌజల్స్, 1 సోలార్ ఫెన్సింగ్ పలక, బ్యాటరీ కాలిబూడిదైందని తెలిపారు. మొత్తం నష్టం విలువ రూ.8.83 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశామని, రిపోర్టు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. తహసీల్దార్ వెంట ఎంఆర్ఐ నూర్‌సింగ్, బాధిత రైతులు కొడారి నరేశ్, సట్ల రమేశ్, లక్ష్మి, రాజేందర్, శ్రీకాంత్, మహేశ్, ప్రవీణ్ ఉన్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతిచెందారు. అనుమానస్పద స్థితిలో గర్భిణి, విద్యుత్‌షాక్‌తో యువకుడు, రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతిచెందారు.

అనుమానాస్పదంగా గర్భిణి..

భైంసాటౌన్: పట్టణంలోని పాండ్రిగల్లికి చెందిన తబస్సుమ్(27) అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన షేక్ ఫాజిల్‌తో తబస్సుమ్‌కు 8 ఏళ్ల క్రితం వివాహం కాగా, వీరికి ఇద్దరు సంతానం. ప్రస్తుతం ఏడోనెల గర్భిణిగా ఉంది. ఈక్రమంలో గురువారం ఉదయం ఇంట్లో కాలుజారి పడి తీవ్రంగా గాయపడిందని, స్థానిక ప్రభుత్వ ఏరియాస్పత్రికి తీసుకెళ్లగా మృతి చెందిందని భార్య తరపు కుటుంబీకులకు ఫాజిల్ సమాచారమిచ్చారు. దీంతో వారు ఆస్పత్రికి చేరుకుని, తన కూతురు మృతిపై అనుమానాలున్నాయని తల్లి షేక్ అలీమా బేగం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

బోథ్: మండల కేంద్రంలో ఈనెల 27న జరిగిన రోడ్డు ప్రమాదంలో ముద్దం రాజు(41) తీవ్ర గాయాలై అదిలాబాద్ రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. గురువారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. కాగా, ఈ ప్రమాదంలో ముసుగు రాకేశ్ రెడ్డి మృతిచెందారు.

కరెంటు షాక్‌తో యువకుడు..



మహ్మద్ అజార్(ఫైల్)

ముధోల్: మండల కేంద్రానికి చెందిన మహ్మద్ అజార్ (30) విద్యుత్ షాక్‌తో మృతిచెందినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బస్టాండ్ సమీపాన అజార్.. బైక్ సర్వీస్ సెంటర్ నడుపుతూ ఉండేవాడు. రోజువారీలాగా బైక్‌ను సర్వీసింగ్ చేస్తూ మోటార్ ఆన్‌చేసే క్రమంలో గురువారం ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగలి కింద పడిపోయాడు. స్థానికులు, బంధువులు భైంసా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఇంటర్నేషనల్ కరాటే సెమినార్‌లో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న రవి

బెల్లంపల్లి: కేరళ రాష్ట్రంలో గతనెల 26, 27 తేదీల్లో నిర్వహించిన 12వ ఇంటర్నేషనల్ సిటోరియా కరాటే స్కూల్ ఆఫ్ ఇండియా టెక్నికల్ సెమినార్‌లో మాస్టర్లు ప్రతిభకనబర్చారు. పలు రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది పాల్గొనగా, రాష్ట్రం నుంచి ఏడుగురు మాస్టర్లు హాజరయ్యారు. టెక్నికల్ సెమినార్‌లో నైపుణ్యత కనబర్చిన మాస్టర్‌లకు జపాన్‌కు చెందని కేఎస్‌కేఎస్ఐ ఫౌండర్ గ్రాండ్ మాస్టర్ సోకే కేఎస్‌యూమా భాని ప్రతిభ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సర్టిఫికెట్లు అందుకున్న వారిలో రమేశ్‌కుమార్, విజ్జగిరి రవి, సారిక రాజు, మారపాక దేవయ్య, ఎస్.సురేశ్, సోలంకి అశోక్, నారాయణ శెట్టి శ్రీనివాస్ ఉన్నారు. వీరిని పలువురు అభినందించారు.

గిరిజన గురుకులాల్లో 99 శాతం ఉత్తీర్ణత

ఉట్నూర్‌రూరల్: పది ఫలితాల్లో గిరిజన గురుకులాలు 99 శాతం ఉత్తీర్ణత సాధించాయని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఓ ప్రకటనలో తెలిపారు. గత విద్యాసంవత్సరం 96.33 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ఈసారి మూడు శాతం పెరిగిందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 గిరిజన బాల, బాలికల గురుకులాల్లో బాలికలు 591 మంది, బాలురు 253 మంది ఉత్తీర్ణత సాధించారు. గురుకులాల్లో మిషన్ లక్ష్యం కార్యక్రమాన్ని అమలు చేయడంతో ఉత్తమ ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది కృషి ఉందంటూ పీవో, ఆదిలాబాద్ ఆర్సీవో అగస్టిన్ అభినందించారు.

'పరిహారం అందేలా చూస్తాం'



గుండ్లసోమారంలో పంటలు పరిశీలిస్తున్న ఆర్డీఓ హరికృష్ణ

నెన్నెల: వడగళ్ల వర్షాలతో జరిగిన పంట నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు పరిహారం అందేలా చూస్తామని బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణ అన్నారు. గురువారం వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో కలిసి గుండ్లసోమారం, బొప్పారం, చిత్తాపూర్, ఆవుడం, గంగారాం, మైలారం, గొల్లపల్లి గ్రామాల్లో నష్టపోయిన పంటలను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. గుండ్లసోమారంలో ఇళ్లకూ లిపోయిన బాధితులకు పరిహారం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. భీమిని ఏడీఏ సురేఖ మాట్లాడుతూ మండలంలో సుమారు 150 ఎకరాల్లో వరి, ఐదు ఎకరాల్లో జొన్న పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక పరిశీలనలో తేలిందని అన్నారు. సుమారు 300 ఎకరాల్లో వందమంది రైతులకు సంబంధించిన మామిడి కాయలు నేలరాలినట్లు గుర్తించామని ఉద్యానవన అధికారి అరుణ్ తెలిపారు. తహసీల్దార్ మహేంద్రనాథ్, ఏఓ సృజన, ఏఈఓలు రాంచందర్, శైని, మాజీ జెడ్పీటీసీ సింగతి శ్యామలరాంచందర్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో పశువుల దొంగలు!

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో రోడ్లపై పడుకుని ఉన్న పశువులను ఎత్తుకెళ్లిన దొంగలు పోలీసులు అదుపులో తీసుకున్నట్లు సమాచారం. జన్మభూమినగర్ ప్రాంతంలోఓ పశువును కొందరు ఎత్తుకెళ్లి ఆటోలో తరలిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిసింది. ఆటోడ్రైవర్‌తోపాటు మరో ముగ్గురిని అదుపులో తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

ఇళ్ల జాబితాలో పేరు లేదని ఆత్మహత్యాయత్నం




చికిత్స పొందుతున్న కుమ్మరి రవీందర్

కోటపల్లి: ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేరు తొలగించారని మనస్తాపం చెంది మండలంలోని రొయ్యపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రవీందర్(30) ఆత్మహత్యాయత్నం చేశాడు. రవీందర్ ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాడు. గ్రామంలో 93మందితో అర్హుల జాబితా ప్రకటించగా అందులో పేరొచ్చింది. మొదటి దశలో 22మందిని ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎంపిక చేశారు. ఇందులో పేరు లేకపోవడంతో కమిటీ సభ్యులు రాజకీయ కారణాలతో తన పేరు తొలగించారని మనస్తాపం చెందిన రవీందర్ బుధవారం రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రవీందర్ ఆరోగ్యం నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి దృష్టికి వెళ్లడంతో ఆయన స్పందించారు. సోషల్ మీడియా ద్వారా ఓ వీడియో విడుదల చేశారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తానని, నిరుపేదలకు అన్యాయం జరగకుండా చూస్తానని పేర్కొన్నారు. మళ్లీ సర్వే నిర్వహించి అర్హులకే ఇళ్లు అందజేస్తామని తెలిపారు. రవీందర్ ఆత్మహత్యాయత్నం బాధాకరమని, ఆయనతో ఫోన్‌లో మాట్లాడి న్యాయం చేస్తామని హామీనిచ్చారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

భర్త మందలించాడని భార్య ఆత్మహత్య

ఉట్నూర్‌రూరల్: భర్త మందలించాడని భార్య ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై మనోహర్ కథనం ప్రకారం..మండలంలోని నాగోబాగూడ గ్రామానికి చెందిన ఆత్రం రమేశ్‌కు మత్తడిగూడకు చెందిన అనసూయ(28)తో పదేళ్ల క్రితం వివాహమైంది. ఈ దంతపతులకు ఏడాది వయస్సు ఉన్న బాబు ఉన్నాడు. రమేశ్ మత్తడిగూడలో తన అత్తవారి చేను చేసుకుంటూ రోజు వస్తూ వెళ్తున్నాడు. ఈనెల 29న కుమారుడు అల్లరి చేస్తుంటే తల్లి అనసూయ కొట్టింది. చిన్న పిల్లవాడిని ఎందుకు కొడుతున్నావని భర్త మందలించాడు. క్షణికావేశంలో ఎలుకల మందు తాగడంతో వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


భార్య కాపురానికి రావడం లేదని..



రమేశ్ (ఫైల్)

తానూరు: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బోల్సా గ్రామానికి చెందిన అక్కం రమేశ్ గతకొన్నేళ్లుగా మద్యానికి బానిసై పని చేయకుండా తిరుగుతున్నాడు. భర్త తాగుడు మానడం లేదని కుమారుడు, కుమార్తెతో కలిసి భార్య స్వరూప పుట్టిల్లు అయిన ముధోల్‌కు వెళ్లింది. రెండునెలల క్రితం రమేశ్ ముధోల్‌కు వెళ్లి భార్యతో ఉంటున్నాడు. భార్య కాపురానికి రావాలని అడిగితే రాకపోవడంతో ఒక్కడే రెండురోజుల క్రితం బోల్సాకు వెళ్లాడు. భార్య కాపురానికి రావడం లేదనే మనస్తాపంతో బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. మృతుడి తల్లి లక్ష్మిబాయి ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసినట్లు ట్రెయినీ ఎస్సై తెలిపారు.

యువకుడి బలవన్మరణం



తరుణ్ (ఫైల్)

ఖానాపూర్: ప్రేమ విషయమై యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. ఏఎస్సై లక్ష్మీనారాయణ కథనం ప్రకారం..పట్టణంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన జక్కుల ఇందూర్ కుమారుడు తరుణ్ అలియాస్ సిద్దూ (24) ఇంటర్‌పూర్తి చేసి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గతేడాది క్రితం యువతితో పరిచయం ఏర్పడింది. ఆమెను ప్రేమిస్తున్న విషయమై గురువారం వేకువ జామున ఇంట్లో దూలానికి చీరతో ఉరేసుకున్నాడు. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

మిస్సింగ్ కేసు

తానూరు: మండలంలోని హిప్నెల్లికి చెందిన దుప్పె అవినాష్ (45) కనిపించకపోవడంతో గురువారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై భానుప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అవినాష్ కుటుంబంతో హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. అవినాష్ గతనెల 28న స్వగ్రామమైన హిప్నెల్లికి వచ్చి 30న తిరిగి వెళ్లాడు. ఆయన తమ్ముడు గురువారం అన్నకు ఫోన్ చేస్తే కామారెడ్డిలో ఉన్నానని చెప్పాడు. ఆ తర్వాత ఫోన్ స్విచ్‌ఆఫ్ వచ్చింది. హైదరాబాద్‌లో ఇంటికి చేరుకోలేదని తమ్ముడు గురువారం ఫిర్యాదు చేశాడు. ఈమేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.